జాతీయ స్థాయిలో 'మిట్స్'కు అరుదైన గౌరవం

పత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. దేశంలో అత్యుత్తమ విద్యా సంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిందని, అందులో కళాశాలకు ఇంజినీరింగ్ విభాగంలో 201 నుంచి 300 స్థానం లభించిందని పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద యూనివర్సిటీలు, కాలేజీలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్లు, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, మెడికల్ ఇలా మొత్తం 13 విభాగాల్లో ర్యాంకులకు ప్రకటించారన్నారు. కళాశాలకు ఈ ఘనత లభించిందని తెలిపారు. విద్యాసంస్థల్లో అందిస్తోన్న విద్యాబోధన, కల్పిస్తున్న సౌకర్యాల ఆధారంగా కళాశాలకు ఈ ర్యాంకును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఘనత సాధించినందుకు గాను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అధ్యాపకులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో నెలకొన్న భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని రాష్ట్ర రవాణా క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో మంత్రి అధ్యక్షతన రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఐదు సంవత్సరాలలో చేయవలసిన పని ఏదైనా ఉందంటే అది రైతు కంట్లో నీరు తుడిచే బాధ్యతన్నారు. భూములను మనకు చేరువచేసే వ్యవస్థ రెవెన్యూ మాత్రమేనని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్ల వల్ల చాలామంది రైతులు ఇబ్బందులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు వైరుధ్యాలు వైషమ్యాలు పక్కనపెట్టి రెవెన్యూ సదస్సులో పాల్గొని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. జిల్లాలో 472 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, 45 రోజులపాటు ఈ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిర్దేశించిన కాలపరిమితిలోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయా గ్రామాల్లో రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో వ్యక్తుల పేర్లు అలాగే లోగోలను రాళ్లపై వేయడం సరికాదని ప్రభుత్వం భావించిందన్నారు. భూమి ఒక శాశ్వత హక్కు ఆ భూమికి హక్కును కల్పించడమే తప్ప అందులో ఎవరి పేర్లు ఉండరాదని పేర్కొన్నారు. గతంలో రీ సర్వే చేసి జారీ చేసిన పట్టాలను కలెక్ట్ చేసుకుని ఎటువంటి పేరు లేకుండా న్యూట్రల్‌గా ప్రభుత్వ లోగోతో ఒక పట్టాదారు పాస్ పుస్తకం అందిస్తామని తెలిపారు. ఏవైతే వ్యక్తుల నుంచి పట్టాలు తీసుకుంటామో డూప్లికేషన్ లేకుండా ఉండేందుకు వాటిని దగ్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలన్నీ చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని, జిల్లాలో జెసిలతో పాటు ముగ్గురు సబ్ కలెక్టర్లను స్పెషల్ అధికారులుగా నియమిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ముందుగానే ప్రకటిస్తామన్నారు. సమావేశంలో అందిన సూచనలు సలహాలను కూడా పరిగణలోకి తీసుకొని రెవెన్యూ సదస్సులను పటిష్టంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూమి సమస్యల పరిష్కారానికి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై శాసనసభ్యులు, వివిధ పార్టీ ప్రతినిధులు తగు సూచనలు సలహాలు అందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఇన్‌స్పైర్ నామినేషన్లు సమర్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా పరిధిలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లు సమర్పించాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడానికి ఇన్‌స్పైర్ మనాక్ ఒక అద్భుతమైన వేదిక అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు విద్యార్థులలో దాగివున్న శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించడానికి నామినేషన్లు స్వీకరిస్తున్నారని అన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా నుండి 326 ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు వారి వ్యక్తిగత ఖాతాలలో జమ చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రతి ప్రాథమికోన్నత, అన్ని ఉన్నత పాఠశాలల నుంచి నామినేషన్లను సమర్పించి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. ఇందులో అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలు భాగస్వాములు కావాలని తెలిపారు. డిఇఒ శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్ల సమర్పణలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేటలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణకు ప్రయివేట్, ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయుడి చొప్పున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నైదియా, ఎడి ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఆప్ కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎఎంఒ సమీవుల్లా పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలి : 'మండిపల్లి'

ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన హర్ ఘర్ తిరంగా బ్యానర్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం మనందరి బాధ్యత అని ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 15 వరకు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వాములై దేశ సమగ్రతను కాపాడే మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

100 మీటర్ల జాతీయ జెండాతో ఘనంగా ర్యాలీ

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం రాయచోటిలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణ రావు, ఆర్‌డిఒ రంగస్వామి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డిఇఒ శివ ప్రకాష్ రెడ్డి, డిఎస్‌పి రామచంద్రరావు, డిఎఫ్ఒ అనిల్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ర్యాలీని కలెక్టరేట్ నుంచి అన్నమయ్య సర్కిల్ మీదుగా మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు నిర్వహించారు. ర్యాలీలో శ్రీ చైతన్య హై స్కూల్, రాజు హై స్కూల్, గిరిజన పాఠశాల, సాయి హై స్కూల్, సాయి ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తదితర విద్యాసంస్థల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చివరిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులతో జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞన చేయించారు.

దేశ విభజనపై ఛాయ చిత్ర ప్రదర్శన

1947లో దేశ విభజనను పురస్కరించుకొని మంగళవారం విభజన సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద నాటి దేశ విభజన సంస్మరణ దినోత్సవం తాలుకా ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రముఖ వైద్యులు కె.బాయరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆగష్టు 15 సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ప్రదర్శనను పట్టణ ప్రజలందరు సందర్శించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జగదీశ్ చీఫ్ మేనేజర్ భారతీయ స్టేట్ బ్యాంకు, వైద్య శాఖ రాయచోటి సుంకేశుల వన్నూరు బాష, పూన సుబ్బరామయ్య శెట్టి, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం

తహశీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి వర్గీకరణపై ఆగష్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధంగా ఉందని మాలమహానాడు నాయకులు అన్నారు. ఆ తీర్పుకు నిరసనగా మంగళవారం పీలేరు రెవెన్యూ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. 'వర్గీకరణ వద్దు-ఐక్యత ముద్దు' అని వారు నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహశీల్దారు భీమేశ్వర రావును కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ద్వారా వచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఎన్నో దశాబ్దాల నుండి వస్తున్న రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగమే సుప్రీం కోర్ట్ తీర్పు అని, ఈ తీర్పు ద్వారా క్రిమిలేయర్ అంటూ రిజర్వేషన్ ఎత్తివేసే ఆలోచన మానుకోవాలని, కులాల మధ్య చిచ్చుపెట్టే దిశగా మాల, మాదిగల విభజించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ ఎస్‌సి వర్గీకరణ చేయాలన్న ప్రయత్నం జరిగినప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దళితులు పెద్ద ఎత్తున చేసిన పోరాటం కంటే రానున్న రోజుల్లో లక్షలాది మందితో తీర్పునకు వ్యతిరేకంగా పోరాటాలు మొదలవుతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎస్‌సి వర్గీకరణ అంశంతో పాటు క్రిమిలేయర్ అనే అంశాన్ని పక్కన బెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి సంఘాల నాయకులు తుమ్మల ధరణ్ కుమార్, నగరిమడుగు సుభాష్, జెట్టి మల్లికార్జున, బద్దె భానుప్రకాష్, గుండ్లూరు సదశివ, గుండ్లూరు రాజేశ్వరి, రెడ్డి రాణి, గుర్రం లోకనాథం, దప్పేపల్లి ఆనంద్, గుండ్లూరు నాగేంద్ర, బెల్లం పురుషోత్తం, బొప్పసముద్రం దామోదరం, తుమ్మల రవి కుమార్, పాలేటి, చలపతి, బొప్పసముద్రం వెంకటరమణ, చీనేపల్లి శ్రీనివాసులు, తుమ్మల రవి చంద్ర, బొప్పసముద్రం రాఘవ, దుబ్బా వెంకటరమణ, ద్వారక పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న డిఎఒ చంద్ర నాయక్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు : జెడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చునని జెడి చంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పోలి గ్రామంలో జిఎపి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పద్ధతులతో పోల్చితే ప్రకృతి వ్యవసాయం ద్వారా అతి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందడమే కాక ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సర్టిఫికెట్లు కూడా అందిస్తామని చెప్పారు. కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఈ పంట, పీఎం కిసాన్ వంటివి సమగ్రంగా నిర్వర్తించాలని సూచించారు. రైతులకు అండగా ఉండి ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జి.రాజకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, జడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమూల్ డెయిరీని మూసివేస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతుల వద్ద ఎక్కువ ధరకు పాలను కొంటున్న అమూల్ డెయిరీని మూసేయాలని ప్రయత్నిస్తే ఉద్యమిస్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమూల్ డెయిరీ లీటరుకు రూ.37 నుంచి రూ.43 చెల్లిస్తుండగా ప్రయివేటు డెయిరీలు మాత్రం కేవలం రూ.27 నుంచి రూ.33 చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. అమూల్ డెయిరీ లీటర్ పాలు రూ.68లకు విక్రయిస్తుండగా, ప్రయివేట్ డెయిరీ వారు మాత్రం రూ.72 లకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. జిల్లాలోని రాజకీయ ఒత్తిడులు వల్ల లాభల్లో నడుస్తున్న అమూల్ డెయిరీని మూసివేసి, ప్రయివేటు డెయిరీలకు ప్రయోజనం చేకూర్చేందుకు సిద్ధం అవుతున్నారన్నారన్నారు. రైతులకు అధిక పాల ధర ఇస్తున్న డెయిరీలను కొనసాగించక పోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, రైతులు, రాజకీయ పార్టీ నాయకులను కలుపుకుని రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి - రాయచోటి

విజయవాడలో తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ బాబును రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ టిడి జనార్ధన్, టిడిపి జాతీయ కార్యదర్శి బీదా రవిచంద్ర యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి లోకేష్‌తో ప్రసాద్‌బాబు

అవయవ దానంతో కొత్త జీవితం

ప్రజాశక్తి-మదనపల్లి

అన్ని దానాల్లోకెల్లా అవయవదానం మిన్న అని, ఎంతో మందికి కొత్త జీవితాన్ని ఇస్తుందని తిరుపతి శ్రీవెంకట పద్మావతి ఫిజియోథెరపీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్వేత అన్నారు. మంగళవారం స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ ఆధ్వర్యంలో అవయవదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్వేత మాట్లాడుతూ చనిపోయిన ఓ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాల్ని 8 మందికి సెట్ చేయవచ్చన్నారు. ఈ విషయం ఎంతో మందికి తెలియదని, మన భాద్యతగా ఈ విషయాన్నీ అందరికి తెలియజేయాలని పేర్కొన్నారు. మన పురాణాల ప్రకారం, ఆత్మకు మరణం ఉండదని, శరీరానికి మాత్రమే ఉంటుందని, ఆత్మ ఉన్నంతవరకే శరీరం శరీరంలా ఉంటుందని, ఒక్కసారి మరణిస్తే, మరు క్షణం నుంచి ఆ శరీరం పాడైపోతూనే ఉంటుందని పేర్కొన్నారు. కొంత టైమ్ లోపు కళ్లు, కిడ్నీలు, లివర్ వంటి కీలక అవయవాల్ని సేకరించి, ఇతర అవసరమైన, సత్ప్రవర్తన కలిగిన వారికి సెట్ చేయడం వల్ల వారికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 13న అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం జరుపుతున్నారన్నారు. ఈ రోజున ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, డాక్టర్లు, ఆస్పత్రుల నిర్వాహకులు, అవయవదానం గొప్పదనాన్ని వివరిస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవయవదానంలో పాత్ర వహించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, సివిల్ అధ్యాపకులు, ఎఎస్‌సిఇ స్టూడెంట్ చాప్టర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్వేత

పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

పరుగు పందెంలో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని వలసపల్లి జవహర్ నవోదయలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న రీజనల్ స్థాయి అథ్లెటిక్ మీట్‌లో భాగంగా రెండవ రోజు మంగళవారం అథ్లెటిక్ పోటీలలో భాగంగా 3000 మీటర్ల పరుగుల పందేన్ని ప్రిన్సిపల్ గోవిందరావు స్టార్టర్ పిస్టల్ పేల్చి ప్రారంభించారు. అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొని వాళ్ళ నైపుణ్యతను ప్రదర్శించారు. హైజంప్, 600, 800, 1500, 3000 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడి సత్తా చాటారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు జి.సురేంద్ర రెడ్డి, హెచ్.కొటాయి, అధ్యాపక అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యూఎసి బృందానికి విసి ప్రశంసలు

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అసెస్మెంట్ సెల్(ఐక్యూఎసి) బృందానికి విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిటూషనల్ ర్యాంకింగ్ ప్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) -2024లో యోగివేమన విశ్వవిద్యాలయానికి 51 నుంచి 100 లోపు ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఐక్యూఎసి సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యంశర్మ, కమిటీ ప్రతినిధులు డాక్టర్ సుభోష్ చంద్ర, డాక్టర్ కట్టానరసింహులు, డాక్టరు విజయలక్ష్మీ, డాక్టర్ రియాజున్నీసా, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ దాక్షాయణి, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు పత్రాలతో వారు వచ్చి విసిని కలిశారు. పత్రాలు పరిశీలించిన తరువాత బృంద కృషిని కొనియాడారు. ఇదే పనితీరును కొనసాగించాలని సూచించారు. విశ్వవిద్యాలయానికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు పట్ల విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు సంతోషం వ్యక్తం చేశారు.

అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ నడిబొడ్డులో ఉన్న కోమటివానిచెరువులో కొంతకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలోని చెత్తాచెదారం పెద్దెత్తున చెరువులోకి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెంటనే వ్యర్థాలను తొలగించేలా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్వయంగా కోమటివానిచెరువు వద్దకు చేరుకొని వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగునీటి కాలువల ద్వారా కోమటివానిచెరువుకు వ్యర్థాలు భారీగా చేరాయన్నారు. ఈ పరిసర ప్రాంతాలు దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సత్వరమే వ్యర్థపదార్థాలను జెసిబిలు, ట్రాక్టర్ల సాయంతో తొలగించే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. త్వరలోనే చెరువు సుందరీకరణకు శ్రీకారం చుడతామన్నారు. పట్టణ ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. దీనిపై మదనపల్లి టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ అంశాన్ని మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజా బీ, యువ నాయకులు జునైద్ అక్బరీ, నాగూర్ వలి, నవీన్ చౌదరి, గంగారపు రామ్మూర్తి నాయుడు, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రైస్ మిల్ శశి, బీదం గురునాథ్ యాదవ్, జెసిబి వేణు, బాలమాలి శేఖర్, మడితం రమణ, మంజు మరియు సచివాలయ అడ్మిన్లు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక,ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2024వ సంవత్సరానికి సంభందించి, జిల్లా స్థాయి ఉపాధ్యాయ పురస్కారానికి అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. దరఖాస్తుదారునకు కనీసం 15 సంవత్సరముల భోదనా అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఇసుక అక్రమ రవాణా అరికట్టి, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఉచితంగా పంపిణీ చేసి భవణ నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీం భాష కోరారు. మంగళవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి. కొత్తకోట మండలంలో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక లేక నిర్మాణ పనులు జరగక, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని తెలిపారు. తంబళ్ళపల్లి నియోజకవర్గంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక రీచ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ నెల 19న మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి తంబళ్ళపల్లి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు వేణు, గోపాల్‌రెడ్డి, తాపీ మేస్త్రీ వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజులు, బాలకృష్ణ, మురళి పాల్గొన్నారు.

రసవత్తరంగా అండర్-19 క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప

ఈశ్వర్ రిత్విక్ 182 పరుగులు, ఎం.యువన్ 95 చేయడంతో విశాఖపట్నం జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ అండర్-19 బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం ఆరవ రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఎసిఎ స్టేడియంలో విశాఖపట్నం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 89.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 356 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి ఈశ్వర్ రిత్విక్ 294 బంతులను ఎదుర్కొని 18 బౌండరీలు, 7 సిక్సర్ల సహాయంతో 182 పరుగులు చేశాడు. ఎం.యువన్ 95 పరుగులు చేశాడు. కృష్ణా జట్టులోని ఆదర్శ రెండు వికెట్లు తీసుకున్నాడు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగుకు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 91.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. ఆ జట్టులోని చరణ్జిత్ 66, లోహిత్ లక్ష్మీనారాయణ 53 పరుగులు చేశారు. కడప జట్టులోని నాగ కుళ్లాయప్ప 3, జి.హెచ్.కె.రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో 122 పరుగులకే నెల్లూరు జట్టు కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 29.0 ఓవర్లలో 122 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 59 పరుగులు చేశాడు. వెస్ట్ గోదావరి జట్టులోని డి. యశ్వంత్ 3, రేవంత్ నాగ కుమార్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 60.0 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 268 పరుగులు చేసింది. ప్రాజెక్టులోని రేవంత్ నాగ కుమార్ 121 పరుగులు చేసి నాటౌట్‌గా ఆడుతున్నారు. రక్షణ్ 76 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని టి.మోహన్ 2 వికెట్లు తీసుకున్నాడు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు ప్రమాదాలపై ఆటో డ్రైవర్లకు సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కలికిరి పోలీసు స్టేషన్‌లో ఆయన ఆటో డ్రైవర్లను స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోను ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలపరాదని, ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకుం టామని అన్నారు. తాగి డ్రైవింగ్ చేయకూడదని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు తెలియ పరచమని, రైతులుకు సంబంధించిన ఎవరైనా వైర్లు దొంగతనం చేసి ఆటోలో తీసుకుని వెళుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు స్టేషన్‌లో వాహనం ఆర్‌సి ఇచ్చి పోలీస్ నెంబర్లు తీసు కోవాలని, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ మధు సూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ కొండప్ప, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-రామాపురం

పాడి రైతులు గ్రామస్థాయిలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. మండలంలోని చిత్తూరు పంచాయతీ చెనక్కాయలపల్లెలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్‌మిషన్ జిల్లా పశు గణాభివృద్ధి సంఘం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 35 రకాల పశువులకు గర్భకోశవ్యాధులు, పదిచూలు పశువులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం ఆయన పాడి రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ పెయ్యదూడలు పుట్టేటట్టు ఎద సూదులు వినియోగించుకోవాలన్నారు. రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య మాట్లాడుతూ త్వరలో జరగబోయే గాలి కుంటు వ్యాధి నివారణకు వేసే టీకాలను పాడి రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో సహాయం సంచాలకులు సురేంద్రనాథ్, బెనర్జీ, పశువైద్యులు శివరాంరెడ్డి, మండల పశు వైద్యులు ప్రవీణ్‌కుమార్‌రెడి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు వైద్య సిబ్బందికి ఉద్యోగ భద్రత

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉద్యోగస్తులను రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించినట్లు వైద్యాధికారి ఎన్‌వి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంటాక్ట్ హెల్త్ అసిస్టెంట్స్, ఫార్మసిస్టు వీరు ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గత నెల జులై మాసంలో వీరు ముగ్గురు రెగ్యులర్ అయినట్లు తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు పల్లవి 2009 సంవత్సరంలో, శివప్రసాద్‌బాబు 2003లో, షేక్ షరీఫ్‌బాషా ఫార్మసిస్ట్ 2012లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న వీరికి ప్రభుత్వ భద్రత కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపి హెచ్‌ఇఒ జి.జయరామయ్య, హెల్త్ సూపర్వైజర్ రెడ్డమ్మ, వెంకటేశ్వరరావు , పిహెచ్ఎన్ సుబంత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు రూ.1.50 లక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపిఎండిసి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్వాతంత్ర దినోత్సవ పురస్కరించుకొని ఎండి ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి ఎండి రూ.1.50 లక్షలు విడుదల చేసినట్లు సిపిఒ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఉద్యోగి అప్పుడప్పుడు క్రీడల్లో కూడా ఉత్సాహంగా పాల్గొని క్రీడలు ఆడినప్పుడు ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు.కార్యక్రమంలో సిపిఒ సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపీనాథ్, చలపతి, చంద్ర, రాజేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

డేటా ఆన్‌లైన్‌కు సహకరించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చిన్నఓరంపాడులో 4400 మంది సభ్యులు ఉన్నారని వీళ్ళకి సంబంధించిన డేటా ఆన్‌లైన్‌లో పొందుపరచలేదని ఎంపిడిఒ విజయరామారావు పేర్కొన్నారు. ఆన్‌లైన్ చేయడానికి రైతులందరూ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, ఫోన్ నెంబర్, వివరాలను సచివాలయ సిబ్బందికి అందించాలని తెలిపారు. సచివాలయం సిబ్బంది రైతుల ద్వారా డేటా మొత్తం సేకరించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులకు అందజేసి ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని అగ్రి టెస్టింగ్ లేబరే టరీని పరిశీలించి,అందులో ఎరువులు విత్తనాల పరీక్ష విధానాలను పరిశీలించి ఫలితాలు ఏ విధంగా వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. మైసూరువారిపల్లె పంచా యతీలోని పగడాల నాగమణి పొలంలో సజ్జ పంటను ఇ-పంట యాప్‌లో నమోదు చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కోడూరు రైతు సేవ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి రైతు మొగ్గుచూపేలా ప్రోత్సహించాలన్నారు.ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి నాణ్యమైన పంటను సాధించవచ్చని చెప్పారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను రైతులకు వివరించాలని అన్నారు. గంగరాజుపోడు గ్రామంలోని గాలి సుజాత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పొలాన్ని పరిశీలించారు. కూరగాయలు ఆకుకూరలు అంతర పంటలుగా వేశారని దీని ద్వారా ఎంత అధిక ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతును కనీసం ఒక ఎకరా అయినా ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.కవిత, ఉద్యానశాఖ అధికారి ఎం.వెంకటభాస్కర్ రైతు సేవకేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మండలంలోని ప్రజలకు జ్వరాలు,మన నివారణ వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అయన తంబళ్లపల్లెలో పర్యటిం చారు. డెంగీ బారిన పడిన బాలికల ఆరోగ్య పరిస్థి తులపై ఆరా తీశారు.

మహారాజశ్రీ రాజంపేట 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో

E.P.No :17/2022/ O.S.No: 57/2014

గొల్ల సుధాకర్, తండ్రి దేశ్ అన్న, వయస్సు 46 సం., వ్యాపారం, సాకిన్, డి.నెం.6/969/A12, నూనెవారి పల్లి, నియర్ రాజు స్కూల్, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.

...D.Hr.

V/s

కోవూరి శివరాజ నాయుడు, తండ్రి నారాయణ స్వామి నాయుడు, వయస్సు 57 సం., వ్యాపారం, సాకిన్, D.S.K.2వ స్టేజీ, డి.నెం.4, అప్ స్టేర్స్, కే.జి.ఎన్ టవర్, 2వ మెయిన్ రోడ్డు, బెంగుళూరు సిటీ, కర్ణాటక స్టేట్.

...J.Dr.

వేలం ప్రకటన

పై కనిన D.Hr. పై కింద కనబరిచిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై వేలం వేయకోరి E.P. దాఖలు చేసియుంటున్నాడు. వేలం వేయుటకు గాను పై కోర్టు నందు 19-08-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు జరుగును. కావున వేలంలో పాల్గొనవలసిన వారు ఎవరైనా పాల్గొనవచ్చునని తెలపడమైనది.

షెడ్యూలు

వై.ఎస్.ఆర్ కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం, రాజంపేట రెవెన్యూ విలేజ్ లోని రాజంపేట మునిసిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 879 సర్కార్ డ్రై విస్తీర్ణం Ac. 1.75 సెంట్ల పైకి Ac.0.87 1/2 సెంట్లు మాత్రమే. హద్దులు: తూర్పు: పి.రామయ్య మరియు ఇతరుల జాగా, పడమర : ఎం.నరసింహులు నాయుడు మరియు ఇతరుల జాగా, ఉత్తరం : ఎం.నాగయ్య జాగా, దక్షిణం : పి.నరసింహులు జాగా మరియు కొవిటివాండ్ల బావి, బావిలో 1/8 వంతు నీటి భాగము, దీని సర్వే నెంబర్ 877, విస్తీర్ణం Ac 0.05 సెంట్లు. దీనికి చెక్కు బందు తూర్పు : ఎం.సుబ్రహ్మణ్యం మరియు ఇతరుల భూములు. పడమర : పి.పాపయ్య భూమి, ఉత్తరం :J.Dr తాలూకు భూమి, దక్షిణం :పి. పాపయ్యకు చెందిన భూమి.

D.Hr. వాల్యూ రూ :25,00000/-
మార్కెట్ విలువ :21,64,110/-
అమీనా (ఫీల్డ్ అసిస్టెంట్ వ్యాల్యూ) -1,85,00000/-

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

పి. సురేష్ కుమార్,
D.Hr పరం అడ్వకేట్,
రాజంపేట.

భూ ఆక్రమణ జరగకుండా చూడాలి : జెసి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో భూఆక్రమణకు తావులేకుండా చర్యలు చేపట్టాలని జాయికలెక్టర్ కలెక్టర్ ఆదర్శ రాజేందర్‌పేర్కొన్నారు. మంగళవ మండలంలోని గోపగుడిపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 756/3లోని ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మండలంలోని సరస్వతిపల్లె సహకార బ్యాంక్ తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో రైతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సహకార బ్యాంకులో ప్రతి రైతుకు సంబం ధించిన వివరాలను ఆన్‌లైన్ చేశారా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4400 ఎకరాలు ఫ్రీహోల్డ్ భూములను గుర్తించి వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా చూడాలని ఆయన విఆర్‌ఒలను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజ నేయులు, ఆర్‌ఐ రవికుమార్, సొసైటీ సిఇఒ నాగేశ్వర్‌రెడ్డి, మండల సర్వే నాగలక్ష్మి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న జెసి ఆదర్శ్ రాజేందర్

పంట నమోదు తప్పనిసరి : ఎడిఎ

వరి నాట్లలో మెలుకువలు వివరిస్తున్న శివశంకర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతులు సాగు చేసే పంటల వివరాలను తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మదనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు(ఎడిఎ) కె.శివశంకర్ అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీమోహన్‌తో కలిసి మండలంలో పర్యటించి వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామ సచివాలయంలోని వ్యవసాయ శాఖ సిబ్బందికి తెలియచేసి ఇ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పంటల వివరాలను ఇ క్రాప్‌లో నమోదు చేయటం వలన భవిష్యత్తులో ప్రభుత్వం రైతులకు అందించే పంటల బీమా, ఇతర సదుపాయాలను పొం దవచ్చని వివరించారు. ప్రస్తుతం ప్రధానంగా రైతులు వరి పంటను సాగు చేస్తున్నారని, వరి నాట్లు వేసే సమయంలో వరి నారుకు కొనలను తుంచి నాట్లు వేయాలన్నారు. వరిలో వచ్చే కాండంతొలుచు పురుగుల వృద్ధితిని నివారించి, అధిక దిగుబడులను సాధించవచ్చు అన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలను, యాజమాన్య పద్ధతులను రైతులు తప్పక పాటించాలన్నారు. స్థానిక సింగల్ విండో కార్యాలయాన్ని సందర్శించి కౌలు రైతులకు పంట రుణాలను అందించాలన్నారు. కార్య క్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు శ్రీకాంత్, కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం నిమ్మనపల్లి పంచాయతీ వారపు సంత ప్రాంగణంలోని సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు గ్రామాల అభివృద్ధి, సంపద సృష్టి, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గత మూడు రోజులగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమం(జిపిడిపి)పై శిక్షణా తరగతులను నిర్వహిం చామ న్నారు. గ్రామాలలోని సంపద తయారీ కేంద్రం నుంచి వర్మీ కంపోస్ట్ ఎరువలను తయా రు చేసి సంపదను సృష్టించే అంశంపై వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా తరలించి సంపద తయారీ కేంద్రంలో వాటి ద్వారా పది రోజుల్లో ఎరువును తయారుచేసి రైతులకు విక్రయించి సంపదను సృష్టించాలని పేర్కొన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలకంగా వ్యవహరించనున్నటు తెలిపారు. ప్రభుత్వం ప్రతి గ్రామా న్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా తీసుకుందని అన్నారు. నిమ్మనపల్లి పంచా యతీని ముందుగా ఆదర్శవంతంగా ఎంచుకున్నట్లు తెలిపారు. పారిశుధ్యం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాపు లమ్మ మల్లప్ప, సుబ్రమణ్యం, మహదేవరెడ్డి, ఉషారాణి, జి.శ్రీవాణి, నవీన్, ఆర్ వరలక్ష్మి, చంద్రాయుడు, రెడ్డప్ప, వెంకటరత్న, నూతనకాల్వ రెడ్డమ్మ, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్‌గా ఫణికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.గతంలో మదనపల్లి ఆర్‌డిఒ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఉండే వారిని ప్రస్తుతం కలకడ తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడంలో రైతుల సమస్యలు తీర్చడంలో ముందుంటామన్నారు. బాధ్యత చేపట్టిన తహశీల్దార్‌ను మండల టిడిపి అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, కలకడ టౌన్ ఇన్‌ఛార్జి వైజిలానీబాషా ఆధ్వర్యంలో దుశ్శాలు వాతో ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో సర్పంచ్ విశ్వనాథనాయుడు, మాజీ ఎంపిటిసిలు చంద్రమోహన్, మాజీ సర్పం చులు బరకం శ్రీనివాసులురెడ్డి, త్యాగరాజు, అల్లి, ఇర్ఫాన్, ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఓబులవారిపల్లి మండల తహశీల్దార్‌గా పీర్‌మున్నీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా మండలానికి విచ్చేసిన తహశీల్దార్ బదిలీ కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలిసి వినతి పత్రం అందించవచ్చని చెప్పారు. రెవెన్యూ అధికారులు గ్రామానికి సంబంధించి రికార్డులను భద్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల జోలికొస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజా పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. **ములకలచెరువు:** ములకలచెరువు తహశీల్దార్‌గా ప్రదీప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి అనిల్ కుమార్ ములకలచెరువు తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో బదిలీ అయిన తహశీల్దార్లను ఆయా జిల్లాలకు పంపారు. కలకడ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్‌ను తహశీల్దార్‌గా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. **తంబళ్లపల్లి :** ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా హరిప్రసాద్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ములకలచెరువు డిటిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. విఆర్‌ఒలు, విఆర్‌ఎలతో సమావేశం జరిగింది. విఆర్‌ఒల నుంచి ప్రజల నుంచి రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

తహశీల్దార్ మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు రఘునాథరాజు, సుబ్బరాయుడలతో పాటు ఆర్.ఐ రాజేష్, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, డిటి లవకుమార్, విఆర్ఒ, విఆర్‌ఎలు,విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలను చేబూని కొత్త బస్టాండ్ కూడలి నుంచి కోర్టు, టౌన్ పోలీస్ స్టేషన్, స్టేట్ బ్యాంక్, మార్కెట్, అమ్మవారిశాల, శివాలయం మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ముందుకు సాగాలని మదనపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు యం.షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మిషన్ కాంపౌండ్ నుండి ముందస్తు స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన ముందుకు సాగింది. తొలుత మిషన్ కాంపౌండ్‌లో ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పుర ప్రజలంతా పాల్గొని జాతీయ పండుగ స్వతంత్ర దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, నాదెండ్ల విద్యాసాగర్, నాగూర్ వలి, అప్పస్మా జిల్లా అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, విజయ భారతి డాక్టర్ ఎన్.సేతు, జ్ఞానోదయ స్కూల్ కామకోటి ప్రసాద్ రావు, సాయివిద్యా నికేతన్ శ్రీనివాసరావు, విద్యోదయ శ్రీనివాసులు నాయుడు, వివేకానంద విద్యా మందిర్ కృష్ణప్ప, బ్రహ్మర్షి కేశవరెడ్డి, గౌతమ్ స్కూల్ లక్ష్మీ నారాయణ, బ్రిలియంట్ హైస్కూల్ మొరుంపల్లి సహదేవ రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** 78వస్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ముందస్తు సంబరాలలో భాగంగా కురబలకోట మండలం, అంగళ్లు పంచాయతీ స్థానిక చేనేతనగర్‌లో మహాత్మజ్యోతిబాపులే గురుకుల పాఠశాల వెయ్యి అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. **పీలేరు:** పట్టణంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థులు 450, 100 అడుగుల పొడవైన జాతీయ జెండాలు, జెండాలు, జాతీయ నాయకుల వేషధారణలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.భీమేశ్వర రావు, ఎంపిడిఒఉపేంద్ర రెడ్డి, ఎంఇఒలు లోకేశ్వర్ రెడ్డి, పద్మజ, ఎస్ఐ బి.బాలకృష్ణ నాయుడు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూలో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతదేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం మెగా ఈవెంట్ ర్యాలీ (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌ను విశ్వ విద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలసి ప్రారంభించారు. స్పోర్ట్స్ సైన్సు శాఖ సహ ఆచార్యులు డా. ఎ. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 350 అడుగుల పొడవైన మువన్నెల జాతీయ జెండాను విద్యార్థులు చేతపట్టుకుని ముందుకు కది లారు. ప్రధాన పరిపాలన భవనం నుంచి మొదలై విశ్వవిద్యాలయ అంతర్గత రహదారుల ద్వారా కడప- పులివెందుల రోడ్డు మీదుగా మళ్లీ పరిపాలన భవ నానికి చేరుకుంది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ భారతదేశ పౌరుడిగా గర్విద్దాం, దేశం కీర్తించేలా ఎదిగి దేశ ఔన్నత్యాన్ని శిఖరస్థాయికి తీసుకువెళుదామ ని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశానికి ప్రతీక అయిన మువ్వన్నెల జెండా మురిసేలా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరికీ ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మ, సీనియర్ ప్రొఫెసర్లు, సహ, సహాయ ఆచా ర్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజరాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ రాయచోటి వారి కోర్టులో

O.S.NO : 6/2013

మేకల సాదఖున్నిసా W/o దర్బార్ భాష, వయస్సు-44 సం,, మేకల వీధి. టి.సుండుపల్లి గ్రామం మరియు మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

V/S

(D17). యర్రప్ప రెడ్డి. సుబ్బారెడ్డి S/o పోత్రెడ్డి, వయస్సు-73 సం. రెడ్డివారిపల్లె, టి.సుండుపల్లి గ్రామం మరియు మండలం, అన్నమయ్య జిల్లా.
(D24). బొజ్జా పద్మజ W/o భాస్కర రెడ్డి, వయస్సు-50సం. కొత్తపేట, రాయచోటి టౌన్ , అన్నమయ్య జిల్లా.
(D34) తోట నరసింహులు, S/o వెంకట నరసయ్య, వయసు 70 సం, రెడ్డివారిపల్లె, టి. సుండుపల్లి గ్రామం, మరియు మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాదులు

సమను/నోటీసు

పై నెంబరు దావాలోని వాది అయిన మేకల సాదఖున్నిసా ప్రతివాదులైనా D17, D24, D34 అయిన మీ పైన ఆస్తి విషయమై దావా దాఖలు చేసి యున్నాను. ఇందులో D17, D24, D34 ప్రతివాదులు అయిన మీరు కోర్టు వారి సమనుకు అందనందు వలన ఇందుమూలముగా తెలియ జేయడం ఏమనగా, D17, D24, D34 ప్రతి వాదులైన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది: 28-8-2024 న ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు వారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానిచ బడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 28-8-2024.

//కోర్టు వారి ఉత్తరుల మేరకు//

వై. రమేష్ రెడ్డి, బి.ఎ., బి.యల్.,
వాది తరుపు న్యాయవాది,
రాయచోటి.

మహారాజశ్రీ రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు

I.A.No : 294/2023
M.V.O.P.No :15/2019

ఆలం శ్రీదేవి మరియు 2 Others. ...పిటీషనర్స్

V/s

R. శివప్రసాద్, S/o పెద్ద శంకరయ్య, D.No: 4-200-A, సత్యనారాయణపురం, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

...రెస్పాండెంట్-3

R-3కి నోటీసు

పై కనిన పిటిషనర్లు యాక్సిడెంట్ క్లయిమ్ కొరకు పై కోర్టు నందు పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ డిస్మిస్ అయిన కారణం వలన రెస్టోరేషన్ కోరుచూ 240 రోజులు డిలే ని కండోన్ చేయమని పై పిటీషన్ దాఖలు చేసియున్నారు. 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 16-08-2024వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By order of the Court//

P.SURESH KUMAR
Advocate for petitioners,
Rajampet.

మహారాజశ్రీ రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు

I.A.No : 295/2023
M.V.O.P.No : 15/2019

ఆలం శ్రీదేవి మరియు 2 Others.

...పిటీషనర్స్

V/s

R. శివప్రసాద్, S/o పెద్ద శంకరయ్య, D. N : 4-200-A, సత్యనారాయణపురం, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

...రెస్పాండెంట్-3

R-3కి నోటీసు

పై కనిన పిటిషనర్లు యాక్సిడెంట్ క్లయిమ్ కొరకు పై కోర్టు నందు పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదర్ పిటిషన్ డిస్మిస్ అయిన కారణం వలన రెస్టోరేషన్ కోరుచూ పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 16-08-2024 వ తేదీన వాయిదా ఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By order of the Court//

P.SURESH KUMAR
Advocate for petitioners,
Rajampet.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి టౌన్, అలీమాబాద్ స్ట్రీట్, డోర్ నెం: 30/41-సిలో నివాసం ఉంటున్న షేక్ షరీఫ్ గారి కుమారుడు షేక్ షబుల్ బాషాకి చెందిన పాస్ పోర్ట్ ఈనెల మూడవ తేదీన రాయచోటి బస్టాండ్‌లో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **T8788292** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 9000294332 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు జడ్‌హెచ్‌డిసి కాలనీలో డాక్టర్ గురు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్యానెల్ అడ్వకేట్ ఎం.శంకరయ్య మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు రైల్వే కోడూరు ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి ఆదేశాలతో ఉచిత వైద్య విజ్ఞాన శిబిరం నిర్వహిం చినట్లు తెలిపారు. మారుమూల ప్రాం తాలలోని దళితులకు వెనుకబడిన తరగతుల వారికి వైద్య సహాయం అందించడం కోసం వారి సమస్యలను తెలుసుకొని వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైతే ఉన్నత ఆస్ప త్రులకు సిఫార్సు చేసి అక్కడ కూడా వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో చిన్న పిల్లలు, మహిళలు, బాలింతలకు, వృద్ధులకు డాక్ట ర్ గురుమహేష్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. చికిత్స అవసరమైన వారిని ఓబులవారిపల్లె ప్రభుత్వ వైద్య శాలకు తరలించి తదుపరి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వైద్య శిబిరంలో న్యాయవాదులు ఎం.సురేష్‌రెడ్డి, టి.ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కెవికెకు చేరుకున్న స్వర్ణోత్సవ జ్యోతి

ప్రజాశక్తి-కలికిరి : కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవ జ్యోతి కలికిరి చేరుకున్నట్లు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. పెరియారం కో-ఆర్డినేటర్ గోవిందరాజును జ్యోతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా కలికిరికి చేరుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. పుదుచ్చేరిలో తొలిత కృషి విజ్ఞాన కేంద్రం 1974లో స్థాపించబడినదని తదుపరి కాలంలో ఇప్పటి వరకు 731 కెవికెలను స్థాపించి నట్లు ఆమె తెలిపారు. కెవికె 50 సంవత్సరాలు రైతుల సేవలో పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఐసిఎ ఆర్' కెవికెలలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తుందని అన్నారు. మొదటిగా ఈ వేడుకలు పుదుచ్చేరి కెవికెలో మొదల య్యాయని ఈ సందర్భంలో రైతులను ఆహ్వానించి కెవికెల ప్రాముఖ్యతను వివ రిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ చర్చాగోష్ఠి జరుపుతున్నట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

గంజాయి నిందితుల వివరాల వెల్లడిస్తున్న డిఎస్‌పి కొండయ్యనాయుడు

గంజాయి ముఠాపై పోలీసుల దాడులు

-12 మంది అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయి ముఠాపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడిలో గంజాయి సేవిస్తున్న 12 మంది యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.46000లు విలువగల రెండు కిలోల గంజాయి, రూ. 14.400 విలువగల గంజాయిని సేవించేందుకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తాలూక పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను డిఎస్‌పి కొండయ్య నాయుడు, రూరల్ సిఐ రమేష్, తాలూకా సిఐ శేఖర్ లు వెల్లడించారు. డిఎస్‌పి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం ఎంతో కృత నిశ్చయంతో ఉందని, అందుకనుగుణంగా పోలీసుశాఖ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మదనపల్లి మండలం కొళ్లబైలు పంచాయతీ సమీపంలోని చెట్ల పొదల్లో గంజాయి బ్యాచ్ ఉన్నట్లు సమాచారం రావడంతో తాలూకా సిఐ శేఖర్ సిబ్బందితో దాడులు చేసి గంజాయి సేవిస్తున్న 12 మందిని మదనపల్లి తహశీల్దార్ ఖాజాబీ సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి, వాటిని ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో రాయచోటి మండలం, కోన ప్రాంతానికి చెందిన మౌలా అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు గంజాయి సేవిస్తున్న యువకులు వెల్లడించినట్లు తెలిపారు. పట్టుబడ్డవారిలో గణేష్, బాలాజీ, సునీల్ కుమార్, కిషోర్ కుమార్, కళ్యాణ్, శివశంకర్, శ్రీనివాసులు, జగదీష్, వెంకటేష్, నిరంజన్, విష్ణు, బాబా ఫక్రుద్దీన్ లు ఉన్నారు. వీరందరూ కేవలం పాతికేళ్లలోపు వయసు వారు కావడమే విచారకరమన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎక్కడైనా సరే మత్తు పదార్థాలు గంజాయి లాంటివి విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఒకసారి కేసులు నమోదైన తర్వాత మార్పు రాకపోతే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని, అప్పటికీ మారకపోతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేసి గంజాయి రహిత ఆంధ్ర రాష్ట్రానికి కృషి చేస్తామని తెలిపారు. ఎక్కడైనా సరే గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే తమకు తెలపాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ చెందిన అరవదాసరి జనార్ధన కుమార్తె కనిపించడం లేదని కేసు నమోదుచేసినట్లు ఎస్.ఐ.రామకృష్ణ తెలిపారు. శనివారం మందుల షాపుకు అని నూలివీడుకు వెళ్ళి తిరిగి రాకపోవడం బంధువుల విచారించినా ఎక్కడ కనిపించలేదన్నారు. జనార్ధన ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మదనపల్లిలో గాలివీడు వాసి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో గాలివీడుకు చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాలివీడు మండలం అరవీడు పంచాయతీ కుమ్మరయ్యగారిపల్లికి చెందిన పెద్దన్న కుమారుడు బండారు ప్రభాకర్(39)కు 2016 లో ప్రవల్లిక అనే మహిళతో వివాహమైంది. ఏడాది తర్వాత ఆమె చనిపోవడంతో అదే ప్రాంతానికి చెందిన సుకన్య అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో వీరు గాలివీడులో హోటల్‌నిర్వహిస్తూ జీవనం చేసేవారు. హోటల్ సక్రమంగా జరగకపోవడంతో మూడేళ్ల క్రితం బెంగళూరుకు మకాం మార్చారు. ప్రయివేట్ కంపెనీలో ప్రభాకర్ సూపర్వైజర్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గాలివీడు బ్యాంకులో డబ్బులు తీసుకొస్తానంటూ భార్య సుకన్యకు చెప్పి సోమవారం బెంగళూరు నుంచి గాలివీడుకు వెళ్లాడు. అక్కడి నుంచి రాత్రి బయలుదేరి మదనపల్లెకు చేరుకున్నాడు. స్థానిక రెడ్డప్ప నాయుడు కాలనీ లోని నిర్మానుష్య ప్రాంతంలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతుడు జేబులోని సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. బండారు ప్రభాకర్ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో పోలీసుల విచారణలో తేలనుంది.

నలుగురు కోడి పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గొల్లవారిపల్లి సమీపంలో ఒక మామిడి తోటలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5,100 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.